# 'టానిక్'

మా శ్రీనుకువారంరోజులు జ్వరంవచ్చి నలతచేసి తగ్గింది. బలహీనం గా తయారయ్యేడు. అజీర్ణం అన్నిటికీ మూలం అని చెప్పి వాడికిడైజస్టివ్ టానిక్ వ్రాసి ఇచ్చారు డాక్టరుగారు. వాడి చేత ఎన్ని మాత్రలైనా మిం గించగలంగాని మందు తాగమంటే మాత్రం మా ప్రాణాలు తోడేస్తాడు. ఒక్కోసారి మేము పెద్దాళ్ళు మందు తాగితే పిల్లలకు తగ్గే మార్గమేదైనా వుంటే బాగుండునని అనుకున్న సందర్భాలు కూడా లేకపోలేదు. పైగాఈ డైజస్టివ్ టానిక్ చేదుగా వుండాయె.

డాక్టరుగారికి చెప్పి తీయటి మందేదైనా వ్రాయమని చెప్పాలను కుంటూ ఆఫీసుకు వెళ్ళాను. ఆ టానిక్ తాగకపోతే మళ్ళీ వాడికి నలత చేస్తుందేమో ఎలా అని ఆలోచిస్తూ ఆఫీసునుంచి ఇంటికి తిరిగివచ్చేటప్పుడు డాక్టర్ దగ్గరకు వెళ్ళడం మర్చిపోయాను.

ఇంటికి చేరాను.

"నాన్నగారూ" అంటూ ఎదురు వచ్చేడు శ్రీను. వాడిచేతిలోమందు సీసా వుంది. "నాన్నగారూ ఈ టానిక్ తాగి నేను దారాసింగ్ తాతలా తయారవుతాను" అని మందు సీసా నా చేతిలో పెట్టి, పహిల్వాన్ ఫోజు పెట్టాడు.

ఈలోగా శ్రీమతి వచ్చింది ...ఏమిటి సంగతి?" అన్నట్లు కనుసైగ చేశాను. శ్రీమతి ఏదో పెద్దయుద్ధంలో నైపుణ్యత ప్రదర్శించిన వీర సైని కునిలా ఫోజు పెట్టి "అవునండీ బాబుకు దారాసింగ్‌తాత అంటే ఇష్టంకదా. అందుకని పేపర్‌లో వేసే 'బలవంతులుగా తయారవ్వండి' అనే టానిక్ తెప్పించాను. అది తాగితే శ్రీనుగాడు వారం రోజుల్లో దారాసింగ్‌లా తయా రవుతాడు. ఏరా శ్రీనూ అంతేనా" అంది వాడిని చూస్తూ.

"అవును. అమ్మా అప్పుడు నాన్నగార్ని కు స్తీపోటీలో ఓడించేస్తా -డిష్యుం-" అంటూ నన్ను ఒక్కటిచ్చుకున్నాడు. త్రుటిలో నా ముక్కు చితికిపోయే ప్రమాదం తప్పింది.

వాడు బయటకు వెళ్ళాకా—

"ఏమిటోయ్ విశేషం" అని అడిగాను శ్రీమతిని,

"దానికి మీకు అసలు మతిలేదు వీక్లీలో పడే మందుల ప్రకటనలో పహిల్వాన్ బొమ్మతీసి ప్రొద్దున కొన్న మందుసీసా మీద అంటించేను. వాడేమో దారాసింగ్‌లా తయారవ్వడానికి మందనుకుని చేదుగా వున్నా బల వంతగా త్రాగేశాడు" అంది విజయగర్వంతో, ఛాలెంజర్‌లో పైకి వెళ్ళి నంత సంతోషంతో.

—o—

## శెలవ్

ఆ గదినిండా అగరవత్తులు సువాసన వెదజల్లుతున్నాయి. ఒక కుర్చీలో సూటు వేసుకున్న యువకుడు కూర్చుని వున్నాడు. అతను నల్లగా తుమ్మ మొద్దులా వున్నాడు. నవ్వితే తెల్లని పళ్ళు భయంకరంగా కనిపిస్తు న్నాయి. అతను పెళ్ళిచూపులకు వచ్చిన అబ్బాయి. అతని ప్రక్కనే అతని తల్లిదండ్రులు, ఆ ప్రక్కనే అమ్మాయి తల్లిదండ్రులు నిలబడి వున్నారు.

అందరూ కాఫీ ఫలహారాలు పూర్తిచేశారు.

"అమ్మాయిని తీసుకురా" అన్నాడు అమ్మాయి తండ్రి.

లోపలినుండి అమ్మాయి రాకకోసం ఎదురు చూస్తున్నాడు అబ్బాయి.

అమ్మాయిని తీసుకువచ్చారు.

చామనచాయగా బొద్దుగా వుందా అమ్మాయి. పసుపురంగు విమల్ చీర మీద అదేరంగు జాకెట్ వేసుకుంది. పెళ్ళికొడుకుకన్నా ఏమంత ఎత్తుగా లేదు. ఆ అమ్మాయి ఎంత దాచుకుందామనుకున్నా ముందుకు వచ్చే పై పళ్ళు స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ ముందుకు వస్తున్నాయి. అదొ క్కటే లోపం పాపం ఆ అమ్మాయికి.

కుర్చీలో కూర్చుంది.